

ప్రభుత్వ ఆదాయానికి గండి
తెలుగుదేశం పార్టీ నేతలు అక్రమార్జనే ధ్యేయంగా అడుగులేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎత్తుగడను అమల్లోకి తెచ్చారు. -8లో



నిరాశపరచిన పవన్ పర్యటన
అన్నమయ్య జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నిరాశ పరిచింది. వరద బాధితుల సమస్యలను వినకపోవడంతో వారు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. -8లో

గరిష్టం/కనిష్టం
39.0/27.8

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 27.8 – 39.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు తమ మనోగతాన్ని వెల్లడించారు.

సిబ్బంది పర్యవేక్షణ ఎంతో అవసరం

ప్రభుత్వ సర్వజన ఆసు పత్రిలో ఓపీ, ఐపీ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న సెక్యూరిటీ విభాగం వారు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ఎప్పటికప్పుడు హుషారుగా ఉండాలి. సీసీ కెమెరాలను వార్డులలో ఉన్నప్పటికీ ఎప్పటికపుడు వాటి ని పరిశీలించేందుకు చర్యలు చేపడుతున్నాం. సెన్సిటివ్ వార్డులతో సెక్యూరిటీ అధికా రులు, సిబ్బంది వద్ద వాకీటాకీలను ఏర్పాటు చేయనున్నాం.
– డాక్టర్ ఎస్.ఆర్. రాజేశ్వరి, సీఎస్ఆర్ఎంఓ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్), కడప

భరోసా ఇవ్వాలి

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న మహిళ వైద్యులకు, నర్సులకు భద్రత ఉండాలి. ప్రభుత్వం ఒక ప్రత్యేక మైన చట్టాలను తీసుకుని వస్తే వైద్యులకు, సిబ్బందికి భరోసాగా ఉంటుంది. –శాంతి కళ, డిప్యూటి డీఎంహెచ్ఓ, జమ్మలమడుగు

వైద్య సిబ్బందికి సెక్యూరిటీ ఉండాలి

కడప సర్వజన ఆసుపత్రి లాంటి పెద్ద సముదాయంలో వైద్యులు, వైద్య సిబ్బందికి 24 గంటలు సెక్యూరిటీ ఉండాలి. క్యాజువాలిటీ, ఐసీయూ, ఎమర్జెన్సీ, లేబర్ వార్డు తదితర అత్యవసర విభాగాల్లో పటిష్టమైన రక్షణ చర్యలను చేపట్టాలి. ప్రతి విభాగంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలి. – డాక్టర్ అర్జున్ అవ్వారు, అధ్యక్షులు, ఇండియన్ మెడికల్ అసోషియేషన్, కడప.



కడప రిమ్స్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

న్యూస్‌రీల్

బ్లూ ప్రింట్ ప్రశ్నపత్రాలు సిద్ధం
కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించిన పదవ తరగతి -2025 పరీక్షలకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్లను ప్రభుత్వ సంచాలకులు www.bse.ap.gov.in అనే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపరిచనట్లు డీఈఓ అనురాధ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లకు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు వాటిపైన అవగాహన కలిగించాలని సూచించారు.

బీటెక్ ఫలితాలు విడుదల
పులివెందుల రూరల్: పులివెందుల జేఎన్టీయూ కళాశాల పరిధిలో బీటెక్ మొదటి సంవత్సరం, 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

జిల్లాకు ఎరువులు రాక
కడప అగ్రికల్చర్: జిల్లాకు 1340.80 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులతోపాటు డీఏపీ శుక్రవారం వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు తెలిపారు. ఈ మొత్తంలో 118 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అన్నమయ్య జిల్లాకు తరలించగా మిగతా కాంప్లెక్స్ ఎరువులను జిల్లాకేంద్రంలోని గోడౌన్‌తోపాటు ఆర్‌బీకేలకు తరలించినట్లు డీఏఓ తెలిపారు.

పంపిణీ సజావుగా జరగాలి
కడప సెవెన్‌రోడ్స్: ఇసుక పంపిణీ ప్రక్రియను జిల్లాలో నిర్దేశించిన బుకింగ్ కేంద్రాల్లో పటిష్టంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఇసుక పంపిణీపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ నుంచి కలెక్టర్ శివశంకర్ లోతేటితోపాటు ఎస్పీ హర్షవర్ధన్ రాజు హాజరయ్యారు. వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా అంశాలకు సంబంధించి 08562 246344 కంట్రోల్ రూమ్ నెంబర్ కు కాల్ చేసి సమాచారాన్ని స్వీకరించడం, లేదా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

ఆంధ్రకేసరి సేవలు స్ఫూర్తిదాయకం

ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు స్ఫూర్తిదాయకమని, ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్లో టంగుటూరి ప్రకాశం పంతులు 153 వ జయంతి సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేసీ అదితి సింగ్, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధీరోదాత్తుడు ప్రకాశం పంతులు
కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జయంతిని కడప జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు పాల్గొని ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకట రాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ పాల్గొన్నారు.


టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఆశలు.. నేల పాలు

పాడిపరిశ్రమకు మేలు చేకూరుతున్నా మాకేం పట్టదు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుతం ప్రవేశపెట్టిందా? ఆ కార్యక్రమం రద్దు చేయాల్సిందే..ఇదే లక్ష్యంతో కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. కక్షపూరితంగా వ్యవహరిస్తూ చివరకు అన్నదాతల ఆశలను నేల'పాలు' చేస్తోంది. చంద్రబాబు హెరిటేజ్ మనుగడ కోసం మహిళల నోట్లో మట్టి కొడుతోంది. అమూల్ పాల రేటును క్రమేణా తగ్గిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా పాల సేకరణ కేంద్రాలను ఎత్తేస్తోంది. కూటమి ప్రభుత్వ చర్యలతో పాడి రైతులు నష్టపోతున్నారు.

పాడిపరిశ్రమకు గడ్డుకాలం
- ప్రైవేటు డైరీలు ధరలు తగ్గించడంతో రైతుల అనాసక్తి
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కనిపిస్తున్న స్పష్టమైన మార్పు


కురబలకోట మండలం జంగావారిపల్లెలో అమూల్ పాల సేకరణ కేంద్రంలో పాలు పోస్తున్న మహిళలు (ఫైల్)



సాక్షి కడప/సాక్షి రాయచోటి: ఒకనాడు పాల సేకరణకు పెట్టింది పేరు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలు. పాల పొంగుతో పులకించిపోయాయి. పశు సంపద, పాల వృద్ధితో పల్లెలు పచ్చగా కళకళలాడాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయంతో సమానంగా పాడి పరిశ్రమ నూతన ఒరవడితో కొనసాగింది. తండ్రి స్ఫూర్తితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనూ జగన్ సర్కార్ పాడి పరిశ్రమకు నూతన హంగులు అద్దారు. పాల ఉత్పత్తులు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రైతులను ప్రోత్సహిస్తూ ముందుకు వెళ్లారు. అయితే కాలం గడిచిపోయింది. ప్రస్తుతం ప్రైవేటు డైరీలు పోటీ పడి పాల ధరలను తగ్గించడంతో పాల ఉత్పత్తి కాస్త తగ్గిపోయింది. పాడి పరిశ్రమ ప్రమాదంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైఎస్ జగన్ హయాంలో పాల ఉత్పత్తిలో అన్నమయ్యకు అగ్రస్థానం
వైఎస్ జగన్ సర్కార్ హయాంలో 2020–24 వరకు పాల సేకరణలో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ప్రప్రథమంగా నిలిచింది. ఏకంగా 10 వేలతో ప్రారంభమై లక్ష లీటర్ల వరకు రోజుకు సేకరించడం సామాన్యమైన విషయం కాదు. రాష్ట్రంలోనే పాల ఉత్పత్తుల్లో అన్నమయ్యజిల్లా మొదటి స్థానంలో నిలవగా, మూడు, నాలుగు స్థానాల్లో వైఎస్సార్ జిల్లా ఉండేది. యంత్రాంగం కూడా అదే పట్టుదలతో పాల సేకరణతోపాటు మదనపల్లె లాంటి చోట్ల చిన్నపాటి పరిశ్రమలు నెలకొల్పి పాలకు అనుగుణంగా ఉత్పత్తులు కూడా తయారు చేసే పరిస్థితి ఏర్పడింది. అన్నమయ్య జిల్లాలో అప్పట్లో సుమారు 450 గ్రామాల్లో పాల సేకరణ జరిగేది. వైఎస్సార్ జిల్లాలోనూ గతంలో 140కి పైగా గ్రామాల్లో పాల సేకరణ కొనసాగేది.

పాలధరల తగ్గింపుతో డైరీల వైపు విముఖత
వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో పాల సేకరణ తగ్గిపోయేందుకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేటు డైరీలు పాలకు సంబంధించి సాలిడ్ నాట్ ఫ్యాట్ (ఎస్ఎన్ఎఫ్)ను బట్టి లీటరు ధరను నిర్ణయిస్తారు. వైఎస్ జగన్ సర్కార్ హయాంలో అమూల్ సంస్థ లీటరు పాలకు సంబంధించి రూ. 75–85 వరకు కూడా పాడి రైతులకు గిట్టుబాటు లభించేది. ప్రస్తుతం అమూల్ కూడా ఎస్ఎన్ఎఫ్ 8.0 నుంచి 8.3 ఉంటేనే కొనుగోలుకు ముందుకు వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుత తరుణంలో పలు ప్రైవేటు సంస్థలు ఎస్ఎన్ఎఫ్‌ను బట్టి రూ. 3–5 వరకు ధరలను తగ్గించడంతో పాడి రైతులు కేంద్రాలకు వెళ్లడం తగ్గిస్తున్నారు. ప్రైవేటు డైరీలకు పాలు పోసినా గిట్టుబాటు కాదన్న ఆలోచనతో బయటి మార్కెట్‌లో అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో అమూల్‌తోపాటు హెరిటేజ్, సంఘం, శ్రీజ, అమృత్, దొడ్ల, తిరుమల, బాలమురుగన్, హట్సాన్ ఇలా సుమారు 12 రకాల డైరీలు పాలను కొనుగోలు చేస్తుంటాయి. అన్నమయ్య జిల్లాలో మదనపల్లె, పీలేరు, రాయచోటి, వైఎస్సార్ జిల్లాలోని లింగాల, మైదుకూరు, చాపాడు, పులివెందుల, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజు పాల సేకరణ జరుగుతోంది.

జగన్‌పై కోపంతో పాడి రైతుల పొట్ట కొడుతున్నారు

ఈమె పేరు ఎం. బార్గవి. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం కనసానివారి పల్లె. ఈమెకు నాలుగు పాడి ఆవులు ఉన్నాయి. రోజుకు 50 నుంచి 60 లీటర్ల దాకా పాలు పోసేవారు. పది రోజులకోసారి రూ. 25 వేల నుంచి రూ.30 వేల వరకు బ్యాంకు ఖాతాకు జమ అయ్యేవి. నికరమైన ఆదాయం లభించేది. మూడు నెలల క్రితం వరకు జగనన్న పాల వెల్లువ కింద అమూల్ ద్వారా పాల సేకరణ బాగుండేది. జగన్‌పై కోపంతో అమూల్ కు ఎసరు పెట్టి పాడి రైతుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. వీటిని కొనసాగించాలని కోరుతోంది.

పాల కేంద్రాలకు తగ్గుతున్న రైతులు
జిల్లాలో పాలకు కొదవ లేకపోయినా కేంద్రాలకు పోయే రైతుల సంఖ్య తగ్గుతోంది. ప్రధానంగా ప్రైవేటు డైరీలకు పాలుపోసినా గిట్టుబాటు కాదన్న ఆలోచనతో రైతులు బయట మార్కెట్‌లో అమ్ముతున్నారు. హోటళ్లకు, టీ దుకాణాలు, కూల్ డ్రింక్ షాపులకు, బయట స్వయంగా అమ్మడం, నేరుగా ఇళ్లకు సరఫరా చేయడం, బయట వ్యాపారస్తులకు అమ్ముకుంటూ కేంద్రాలకు వెళ్లడం లేదు. ఎందుకంటే కేంద్రాలకు వెళితే ఎస్ఎన్ఎఫ్ ద్వారా తీసుకోవడంతోపాటు తక్కువ ధర లభించడమే కారణం. దీంతో ఒక్క అన్నమయ్య జిల్లాలోనే సుమారు 21 వేల లీటర్ల వరకు 15 రోజుల వ్యవధిలో తగ్గిపోయాయి. వైఎస్సార్ జిల్లాలోనూ 9 వేల పైచిలుకు లీటర్ల రోజువారి పాలు తగ్గిపోయాయి. చాలా గ్రామాల్లో పాల సేకరణ తగ్గిపోవడానికి ధరలు తగ్గిపోవడమే కారణమన్న మాట వినిపిస్తోంది. ఏదిఏమైనా ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పాడి పరిశ్రమ మళ్లీ తిరోగమన బాటలో పయనిస్తోంది.

అన్నమయ్య జిల్లాలో..
- పాల సేకరణ చేస్తున్న గ్రామాలు: 350
- ప్రతిరోజు సేకరిస్తున్న పాలు: 79 వేల లీటర్లు
- ఇటీవల తగ్గిపోయిన పాలు: 21 వేల లీటర్లు
- ఈ ఏడాది మొదట్లో పాల ఉత్పత్తి: లక్ష లీటర్లు
- జిల్లాలో ఆవులు: 2,76,417
- పశువులు: 1,01,588

వైఎస్ఆర్ జిల్లాలో..
- పాల సేకరణ చేస్తున్న గ్రామాలు: 95
- ప్రతిరోజు సేకరిస్తున్న పాలు: 7468 లీటర్లు
- ఇటీవల తగ్గిపోయిన పాలు: 9332 లీటర్లు
- గతంలో జిల్లాలో పాల ఉత్పత్తి: 16,800 లీటర్లు
- జిల్లాలో ఆవులు: 44,650
- పశువులు: 3,99,910

గేదె పాల ధరల వివరాలు..

నియోజకవర్గం	హెరిటేజ్	సంగం	అమూల్	దొడ్ల
మైదుకూరు	70	76	80	78
పులివెందుల	--	--	80	82
రాయచోటి	--	72	72	--
ఆవుపాల ధరలు				
మదనపల్లె	32	32	32	30
పీలేరు	32	32	--	--
తంబళ్లపల్లె	35 (శ్రీజ)	--	34	32

నష్టపోతున్నాం

5 ఏళ్లుగా 3 ఆవులను పోషిస్తూ పాల దిగుబడి చేస్తున్నాం. ప్రతిరోజూ గ్రామంలోని పాలసేకరణ ఫ్యాక్టరీకి పాలు పోస్తూ ఉంటాం. ప్రస్తుతం లీటరు ఆవు పాలకు రూ. 30 నుంచి 35 వరకు ఇస్తున్నారు. ఏప్రిల్ నెలలో లీటరుకు 43 రూపాయలు వచ్చేది. అప్పుడు అమూల్ డైరీ ఉండడం వల్ల పోటీతత్వంతో ధరలు ఇచ్చేవారు. దాణా ధరలు పెరిగాయి. ఇప్పుడు పాల ధరలు తగ్గించడంతో చాలా నష్టపోతున్నాం. –పొట్టిపాటి రవికుమార్‌రెడ్డి, పాడిరైతు రైల్వేకోడూరు మండలం

పాల ధర తగ్గించారు...

మేము పాడి ద్వారా జీవనం సాగిస్తున్నాం. కొన్ని నెలలుగా ఓ ప్రయివేట్ పాల డెయిరీకి పాలు పోస్తున్నాం. నెల రోజుల క్రితం లీటరు పాలకు రూ. 37 వరకు వచ్చేది. అయితే ఈ నెల పాల ధర బాగా తగ్గించేశారు. కేవలం లీటరు పాలు రూ. 28 నుంచి రూ. 29 మాత్రమే లభిస్తోంది. – రవికుమార్, మేళ్లచెరువు, పీలేరు మండలం

ప్రభుత్వం పునరాలోచించాలి

కూటమి ప్రభుత్వం అమూల్ డెయిరీని పథకం ప్రకారం మూసేస్తోంది. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు అమూల్ డెయిరీకి పాలు పోయడం ద్వారా ఆదాయంతో పాటు గిట్టుబాటు ధర లభించేది. లీటర్ పాలకు రూ.42 వరకు వచ్చేది. పాడి రైతులు సంతోషంగా ఉండేవారు. కుట్రతో కూటమి ప్రభుత్వం పాల రేటును తగ్గించింది. లీటర్‌కు గరిష్టంగా రూ. 35 లోపే ఇస్తున్నారు. ఇలా అయితే రైతులు ఎలా బతుకుతారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి. –ఎస్.ప్రేమ, పాడి రైతు, కురబలకోట మండలం

మెయిన్.. నెంబర్ వన్

కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ప్రతిభా పురస్కారాల్లో 1040 పాయింట్లతో వరుసగా మూడో సంవత్సరం అగ్రస్థానంలో నిలిచి సత్తాచాటింది. రాష్ట్రంలోనే పతకాల పట్టికలో, పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికైంది.

- కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం
- స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో 1857లో ఏర్పాటైన నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్) చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటుతోంది. జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకు ని జిల్లాస్థాయిలో అందజేయనున్న క్రీడాప్రతిభా పురస్కారాల జాబితాలో 1040 పాయింట్లతో జిల్లాలో నెంబర్ 1 స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో కూడా ఇవే అత్యధిక పాయింట్లుగా నిలవడంతో స్టేట్ నెంబర్ 1 స్థానాన్ని పొంది రాష్ట్ర క్రీడాప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. ఈనెల 29న క్రీడాదినోత్సవం పురస్కరించుకుని పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

ముచ్చటగా మూడోసారి పురస్కారం..
కాగా వరుసగా రాష్ట్రస్థాయి పురస్కారానికి మూడోసారి మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) ఎంపిక కావడం విశేషం. పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో అగ్రస్థానంలో నిలిచింది. కాగా గత రెండు పర్యాయాలు రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. 2023–24 విద్యాసంవత్సరంలో వివిధ క్రీడాంశాల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ఒక్క పాఠశాల నుంచే 202 మంది విద్యార్థులు పాల్గొనగా, రాష్ట్రస్థాయిలో 53 పతకాలు, జాతీయస్థాయిలో 6 పతకాలు సాధించి మొత్తం మీద 59 పతకాలతో 1040 పాయింట్లతో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిచి సత్తాచాటారు. కాగా 2014–15 విద్యాసంవత్సరం నుంచి ఏటా జిల్లాస్థాయిలో క్రీడాప్రతిభా పురస్కారాన్ని పొందుతున్న పాఠశాలగా జిల్లా క్రీడాచరిత్రలో ప్రత్యేకతను చాటుకుంది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్.వెంకట లక్ష్మి క్రీడాకారుల కోసం నిత్యం శ్రమిస్తున్నా రు. పాఠశాల సమీపంలోనే డీఎస్ఏ క్రీడామైదానం ఉండటం కూడా వరంగా మారింది. ఇక్కడి విద్యార్థులూ ఆటల్లోనే కాదూ చదువులోనూ రాణిస్తున్నారు. గతేడాది జాతీయస్థాయిలో ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న లోకేష్ అనే క్రీడాకారుడు పదోతరగతి ఫలితాల్లో 581 మార్కులతో కడప నియోజకవర్గస్థాయి టాపర్‌గా నిలవడం విశేషం.

నెంబర్ వన్.. సంతోషం

పాఠశాలలో మెరికల్లాంటి క్రీడాకారులు ఉన్నారు. వారికి తగినంత ప్రోత్సాహం అందిస్తుండటంతో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పతకాలు సాధించగలుగుతున్నాం.
– లక్కిరెడ్డి వెంకటలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్,

వారి కృషి భేష్

చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నాం. వ్యాయామ ఉపాధ్యాయులు అంకితభావంతో క్రీడల అభివృద్ధికి కృషిచేస్తుండటం అభినందనీయం. – పి. నాగమణి, హెచ్ఎం, మున్సిపల్ హైస్కూల్ కడప

ఎంతో సహకారం

నేను ఆర్చరీలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అలాగే గతేడాది పదోతరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించాను. మెయిన్ స్కూల్ నాకెంతో సహకారం అందించింది. – లోకేష్, పూర్వ విద్యార్థి, కడప

రవీంద్రుడు ఇక రథసారధి!
- నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరణ
- ప్రజాపక్షంగా పోరాటస్ఫూర్తిని నింపేందుకు సర్వసన్నద్ధం


సాక్షి ప్రతినిధి, కడప: మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. రాయలసీమ ఉద్యమం విస్తృతంగా నడుస్తోన్న కాలం నుంచి ఆయన అనేక ప్రజా పోరాటాలు చేశారు. రాయలసీమ యువపోరాట సమితి నెలకొల్పి అధ్యక్షుడుగా రాయలసీమ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో తనవంతు పాత్రను నిర్వహించారు. ప్రత్యక్ష రాజకీయాలల్లో చింత కొమ్మదిన్నె జెడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి అంచెలంచెలుగా ఎదిగారు. జెడ్పీ వైస్ చైర్మన్‌గా, కడప మేయర్‌గా పనిచేశారు. కమలాపురం ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారు. సమకాలిన రాజకీయాల్లో విశేష అనుభవం గడించిన ఆయన భుజస్కందాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా బాధ్యతలను అప్పగించారు.

3వ అధ్యక్షుడిగా బాధ్యతలు...
జిల్లాలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పనిచేసిన వారిలో పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి మూడవ వ్యక్తి కానున్నారు. ఇదివరకూ కొత్తమద్ది సురేష్ బాబు, అమర్‌నాథరెడ్డి జిల్లా బాధ్యతలు నిర్వహించారు. ఈసందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపక్షంగా ప్రభుత్వంపై సమిష్టి పోరాటం కొనసాగిస్తామని, ప్రజావ్యతిరేక విధానాల ను ఎప్పటికప్పుడు ఎండగడతామని స్పష్టం చేశారు. ప్రజల గొంతుకగా వైఎస్సార్ సీపీ నిలిచేందుకు కేడర్‌ను సమాయత్తం చేస్తామన్నారు.

ఫిర్యాదు చేస్తే న్యాయం జరగాలి



ప్రభుత్వ ఆసుపత్రి, కళాశాలలో ఉద్యోగులు విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదు చేయడానికి పరిష్కరించడానికి ఫ్యాకల్టీ వైద్యులు, ఇతర అధికారులే సభ్యులుగా ఉన్న కమిటీలు బాగా పని చేయాలి. ఏవైనా సమస్యలపై ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ శరణ్యారెడ్డి, గైనకాలజిస్టు, పులివెందుల

ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి



నిరుపేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో వైద్య వృత్తిని ఎంచుకున్న కోల్‌కత్తాలోని విద్యార్థిని హత్య చేయడం చాలా బాధాకరం. ఆసుపత్రిలో రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు ఎంతో కష్టపడతారు. ఇటీవల కాలంలో ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందిపై దాడులు పెరిగిపోతున్నాయి. హత్యాచారాలకు పాల్పడుతున్న ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి.

– మల్లేశ్వరి, సూపరింటెండెంట్, పులివెందుల



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



వైద్యురాలిపై అత్యాచారం చేసిన వారికి ప్రభుత్వం కఠినంగా శిక్షలు అమలు పరచాలి, ప్రతి హాస్పిటల్‌లో ప్రతి రూమ్‌కు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అవసరం మేరకు బయట వ్యక్తులు హాస్పిటల్‌కి వచ్చినప్పుడు అనుమతి ప్రవేశపెట్టాలి. మద్యం సేవించి వచ్చే వారిని హాస్పిటల్‌లోనికి అనుమతించరాదు.

– డాక్టర్ శ్వేతారెడ్డి, రాయవరం, పీహెచ్‌సీ, సుండుపల్లె

సహకరిస్తే నాణ్యమైన వైద్యం



డాక్టర్లకు పేషెంట్ తరపు బంధువులు సహకరిస్తే నాణ్యమైన వైద్యం లభిస్తుంది. అంతే కానీ గుంపులుగా వచ్చి ఆవేశంతో మాట్లాడి దుర్భాషలాడటం, దాడులకు పాల్పడటం వల్ల వైద్యం అందడం ఆలస్యం అవుతుంది. దీంతో కొన్ని సందర్భాలలో పేషెంట్ ప్రాణాలకు కూడా ముప్పు రావచ్చు.

– డాక్టర్ లక్ష్మీప్రసాద్, జనరల్ సర్జన్, రాయచోటి ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా

గాయపడిన విద్యార్థికి మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



బాలుడిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఇంటర్నేషనల్ కల్యాణ మండపం వద్ద కేబుల్ వైర్లు తగులుకొని విద్యుత్ షాక్ వల్ల ప్రమాదానికి గురైన విద్యార్థిని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పరామర్శించారు. గురువారం సాయంత్రం ఆయన శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్‌కు వెళ్లి బాలుడిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. చనిపోయిన విద్యార్థికి రూ.20 లక్షలు, గాయపడిన విద్యార్థికి రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో బుగ్గవంక వరదల్లో ఇద్దరు బాలురు కొట్టుకుపోగా వారికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇప్పించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ షఫీ, తోటక్రిష్ణ, సద్దాం, బన్నా పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

చక్రాయపేట : మండలంలోని ఓబుళనాయునిపల్లె సమీపంలో శుక్రవారం ఆటో బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్ఐ రంగారావు తెలిపిన మేరకు.. గంగారపు వాండ్లపల్లెకు చెందిన గంగవరం సిద్దన్నగారి చంద్రశేఖర రెడ్డి(66) తన పొలంలో పండించిన కూరగాయలను ఉదయాన్నే వేంపల్లె మార్కెట్‌కు తరలించి ఆటోలో ఇంటికి బయలు దేరారు. ఓబుళనాయునిపల్లె వద్దకు వెళ్లే సరికి ఆటో బోల్తా పడటంతో చంద్రశేఖరరెడ్డికి గాయాలు అయ్యాయి. అతనికి వేంపల్లెలో ప్రథమ చికిత్స చేయించి కడపకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహానికి వేంపల్లె వైద్యశాలలో పోస్టు మార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో టాస్క్‌ఫోర్స్ తనిఖీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశాలతో మత్యశిశు సంరక్షణ పథకంపై సమీక్ష నిర్వహించింది. బృందం ఇన్‌చార్జి, డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య పరమైన సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రమేష్‌రెడ్డి, డీపీఓ నారాయణ, ఏఎస్ఓ హరినాథ్, డీపీహెచ్ఎన్ అరుణకుమారి, వైద్యాధికారి డాక్టరు శ్రీనాథ్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, రవిశంకర రాజు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కేంద్రకారాగారం సూపరింటెండెంట్ బదిలీ

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఐ.ఎన్.హెచ్ ప్రకాష్‌ను నెల్లూరు కేంద్రకారాగారానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. అలాగే నెల్లూరు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రాజేశ్వరరావును కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు.

వెల్లువెత్తిన నిరసన

- ట్రైనీ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలి
- శాంతి ర్యాలీ నిర్వహించిన విద్యార్థినులు



ర్యాలీ నిర్వహిస్తున్న నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



మహావీర్‌జైన్ సర్కిల్ వద్ద విద్యార్థులు, అధ్యాపకుల నిరసన

వైవీయూ : కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై నిరసన వెల్లువెత్తింది. అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించడంతోపాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు నినదించారు. శుక్రవారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల నుంచి వారు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చట్టాలు ఎన్ని వస్తున్నా ఇలాంటి అఘాయిత్యాలు ఆగకపోవడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి మేమందరం మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. అనంతరం పలువురు విద్యార్థినులు కోల్‌కతా ట్రైనీ డాక్టర్ కుటుంబానికి మద్దతుగా నిలుస్తామంటూ ప్లకార్డులు ప్రదర్శించి.. ఉమ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ మీదుగా, మహావీర్ జైన్ సర్కిల్ నుంచి కలెక్టర్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ్‌కుమార్, శ్రావణి, అనంతలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిరాశపరచిన పవన్ పర్యటన

రాజంపేట టౌన్/రూరల్ : అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం పులపుత్తూరులో శుక్రవారం జరిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన పూర్తిగా నిరాశ పరిచింది. మూడేళ్లక్రితం సంభవించిన వరద బీభత్సానికి పులపుత్తూరు గ్రామం దాదాపు తుడిచిపెట్టుకు పోయింది. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా తమ సమస్యలను తెలుపుకొందామని గ్రామ ప్రజలు ఎంతో ఆశపడ్డారు. కాగా వరద బాధిత గ్రామాలైన పులపుత్తూరు, మందపల్లె, తొగురుపేటకు చెందిన ఒక్కొక్క గ్రామం నుంచి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి పవన్ కల్యాణ్‌కు తమ గ్రామాల సమస్యలను తెలిపేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అయితే పవన్ కల్యాణ్ సమావేశ ప్రాంగణానికి రాగానే మందపల్లెకు చెందిన నలుగురు వ్యక్తులు వరుసగా వారి గ్రామ సమస్యలనే చెప్పుకొచ్చారు. అనంతరం తొగురుపేటకు చెందిన ఒక వ్యక్తి తమ గ్రామానికి చెందిన సమస్యను తెలిపారు. దీంతో సమయం అయిపోయిందని పవన్ కల్యాణ్ బయలు దేరడంతో పులపుత్తూరుకు చెందిన ఒక్క బాధితుడు కూడా తమ సమస్యను చెప్పుకోలేక పోవడం వారిలో ఆగ్రహాన్ని తెప్పించింది.

'ఫిలాటలి స్కాలర్‌షిప్'ను సద్వినియోగం చేసుకోండి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తపాలా బిళ్లల సేకరణ (ఫిలాటలి) అభిరుచిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' – ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూనే ఫిలాటలిని అభిరుచిగా కొనసాగించే 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు సర్కిల్ స్థాయిలో ఫిలాటలి ప్రాజెక్ట్, ఫిలాటలి క్విజ్/పరీక్ష ఆధారంగా స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే 2024–25 సంవత్సరానికి దీన్ దయాళ్ స్పర్శ్ యోజన – ఫిలాటలి స్కాలర్‌షిప్ పథకం నోటిఫికేషన్‌ను భారత తపాలా శాఖ విడుదల చేసిందన్నారు. అభ్యర్థి 2023–24లో జరిగిన చివరి పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్/గ్రేడ్ పాయింట్‌లు సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్టల్ ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

బ్లూ కోల్ట్ సిబ్బందికి ఎస్పీ ప్రశంస



కానిస్టేబుల్‌కు నగదు రివార్డును అందజేస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సెల్‌ఫోన్‌ను అధికంగా వినియోగిస్తున్న ఇంటర్ విద్యార్థిని కుటుంబ సభ్యులు మందలించడంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడే క్రమంలో బ్లూ కోల్ట్ పోలీసులు అడ్డుకుని ప్రాణాలు కాపాడి ప్రజల మన్ననలు అందుకున్నారు. సమాచారం అందుకున్న తక్షణమే స్పందించి సకాలంలో ఘటనా స్థలానికి చేరుకొని ఇంటర్ విద్యార్థి ప్రాణాలు కాపాడిన బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు సాయి గోపినాథ్, వై.ఓబులేసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందజేశారు. మున్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం కడప వన్‌టౌన్ పరిధిలో ఓ ఇంటర్ విద్యార్థిని సెల్‌ఫోన్ ను అతిగా వినియోగిస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఇంట్లోని గదిలోకి వెళ్లి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని తలుపేసుకున్నాడు. కుటుంబ సభ్యులు డయల్ 100కు కాల్ చేయడంతో కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘటనా స్థలానికి చేరువలో ద్విచక్ర వాహనంపై విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది సాయి గోపినాథ్, వై.ఓబులేసు క్షణాల్లో అక్కడికి చేరుకొని ఉరేసుకోబోతున్న విద్యార్థిని కాపాడడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రశంసా పత్రాలు అందజేసిన కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ కృష్ణారావు, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు గండిలో మూడో శ్రావణ శనివారోత్సవం

చక్రాయపేట : గండి క్షేత్రంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా నేడు మూడవ శనివారోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఉదయం 3 గంటలకే సుప్రభాత సేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం(ఏకాంతం), అలంకరణ, ఆరాధన, 5 గంటలకు మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు దర్శన వసతి కల్పించనున్నట్లు ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యులు తెలిపారు. మొదటి రెండవ శనివారాల కంటే ఈవారం భక్తుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉండటంతో.. వారికి సరిపడా లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. రాత్రి బస చేసే భక్తుల కాలక్షేప నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతలచే అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మూడవ శనివారోత్సవం సందర్భంగా స్వామి వారికి ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామిలచే ప్రత్యేక అలంకరణ చేస్తారని ఆలయ అధికారి తెలిపారు.

పెద్ద ఎత్తున బందోబస్తు

శ్రావణ మాసం మూడవ శనివారోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పులివెందుల డీఎస్పీ మురళి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, హోంగార్డులు, మహిళా పోలీసులతో కలిపి 270 మంది బందోబస్తులో పాల్గొంటారని వారు పేర్కొన్నారు. వాహనాలను గండిలోకి అనుమతించబోమని ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు అద్దాలమర్రి, ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే ఆపేస్తామని చెప్పారు. లారీలు, టిప్పర్లు వంటి వాటిని చిలేకాంపల్లె, వేపల్లె వద్దనే ఆపేస్తామని చెప్పారు. వీఐపీలు, పాస్‌లు కలిగిన వారు ఉదయం, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు మాత్రమే దర్శనానికి అవకాశం కల్పిస్తామని వారు పేర్కొన్నారు.

చిరుద్యోగులకు చీకటి రోజులు

వైఎస్సార్ ఏఎఫ్‌యూలో 47 మందికి ఉద్వాసన

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే చిరుద్యోగుల జీవితాల్లో చీకట్లు అలముకున్నాయి. కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 47 మంది చిరుద్యోగులను (డైలీ వేజ్ ఉద్యోగులు) ఉన్నఫళంగా తొలగిస్తూ విశ్వవిద్యాలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. 2020లో కడపలో డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విశ్వవిద్యాలయం అవసరాల దృష్ట్యా, విద్యార్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో 2024 మార్చినెలలో 47 మంది చిరుద్యోగులను డైలీ వేజస్ కింద జూనియర్ అసిస్టెంట్, అటెండర్, స్వీపర్ తదితర పోస్టుల్లో నియమించారు. అప్పటి వైస్ చాన్సలర్ అనుమతితో నియామకాలు చేపట్టారు. అదే నెలలో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో సైతం వీరి పోస్టులకు అనుమతి కోసం అజెండాలో ఉంచారు. అయితే అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ అంశాన్ని తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వాయిదా వేశారు. అనంతరం జరిగిన ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చిరుద్యోగుల కష్టాలు ప్రారంభమయ్యాయి. తమను తొలగించడం అనైతికమని.. న్యాయం కోసం తాము పోరాటం చేస్తామని పలువురు చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా విశ్వవిద్యాలయం అధికారులు మాత్రం.. ప్రభుత్వానికి లేఖరాస్తున్నామని, ప్రభుత్వం అనుమతిస్తే కొనసాగిస్తామని పేర్కొంటున్నారు.

అన్యాయం



గత ఐదు నెలలుగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మమల్ని ఒక్కసారిగా తొలగించడం అన్యాయం. ప్రభుత్వం స్పందించి తిరిగి మాకు మా ఉద్యోగాలు ఇప్పించాలని కోరుకుంటున్నాం. మాది జమ్మలమడుగు ప్రాంతం. ఉద్యోగం వచ్చిందని ఇక్కడికి వచ్చి జీవనం కొనసాగిస్తున్నాం. ఉద్యోగం లేకపోతే మాకు ఇబ్బందులు తప్పవు.

– కె. రామలక్ష్మి, అటెండర్, వైఎస్సార్ ఏఎఫ్‌యూ

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి..



మార్చి నెలలో విశ్వవిద్యాలయంలో గార్డెనర్‌గా చేరి పని చేస్తున్నాను. వేతనాలు ఇచ్చేందుకు నిధులు లేవంటూ నాతో పాటు మొత్తం 47 మందిని తొలగించడం బాధగా ఉంది. ప్రభుత్వం స్పందించి మాకు తిరిగి మా ఉద్యోగాలను ఇప్పించాలి. మాది పోరుమామిళ్ల ప్రాంతం. ఉద్యోగం వచ్చిందని ఇక్కడికి వచ్చి పనిచేసుకుంటున్నాం.

– ప్రభ, గార్డెనర్, వైఎస్సార్ ఏఎఫ్‌యూ

అనుమతులు లభిస్తే కొనసాగిస్తాం

47 మంది డైలీవేజస్ సిబ్బంది నియామకానికి ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో వేతనాలు ఇచ్చేందుకు నిధులు లేవు. దీంతో వారిని తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు రావద్దని చెప్పాం. వీరు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వానికి లేఖ రాస్తున్నాం. ప్రభుత్వం అనుమతిస్తే వీరిని తిరిగి కొనసాగిస్తాం.

– ఆచార్య జి. విశ్వనాథకుమార్, వైస్ చాన్సలర్, డా. వైఎస్సార్ ఏఎఫ్‌యూ

గండి ఆలయ అధికారి తీరు ఇష్టారాజ్యం



మాట్లాడుతున్న పాలక మండలి చైర్మన్ కావలి కృష్ణతేజ, సభ్యులు

చక్రాయపేట : గండి దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య.. పాలకమండలి ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ మండిపడ్డారు. ఆయన పాలకమండలి సభ్యులతో కలిసి శుక్రవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి సభ్యులచే సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ ఊసే లేదన్నారు. తన ఉద్యోగం పోయినా ఫర్వాలేదు కానీ ఇప్పట్లో పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయబోనని ఖరాకండిగా చెప్పాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించి ఎలాంటి తీర్మానాలు లేకుండానే నిధులు డ్రా చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణకు తాను అక్కడే ఉన్నప్పటికీ.. ఇది అధికారులు చేయాల్సిన పని అంటూ ప్రధాన అర్చకునిచే జెండా ఎగుర వేయించి తనను అవమానించారని మండిపడ్డారు. దేవదాయ రెవెన్యూ యాక్ట్ జీవో ఎంఎస్ నంబరు 366 తేదీ 19–03–1989 ప్రకారం ఆలయ అధికారి సభ్యుల సమావేశం ఏర్పాటు చేయకపోతే చైర్మన్ హోదాలో సమావేశం ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉన్నందున.. ఇప్పుడు పాలక మండలి సమావేశం పెట్టుకొని కొత్త పుస్తకంలో తీర్మానాలు చేశామని చెప్పారు. ఈవో ఒక్కడే పెద్ద సూట్ గదిని తీసుకున్నాడని, పాలక మండలి సభ్యులకు గదిని కేటాయించలేదన్నారు. దీంతో పాలక మండలిలోని మహిళా సభ్యులు మరుగుదొడ్లకు వెళ్లాలంటే కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉన్న గదులను ఆయనకు ఇష్టం వచ్చిన వారికి ఇస్తూ పాలక మండలి సభ్యులను పట్టించుకోడం లేదని చెప్పారు. 'నేనే రాజు నేనే మంత్రి' తరహాలో ఒంటెత్తు పోకడలను అవలంబిస్తున్న సదరు అధికారిపై తాము దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఖర్చులపై పాలక మండలి సభ్యులకు జమా ఖర్చులు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు జయమ్మ, కుమారి, బిందుసాగర్, మునీశ్వరి, లలితమ్మ, వెంకటరామిరెడ్డి, చక్రపాణిరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

- రూ.18 కోట్ల వరకు ఎగనామం పెట్టేందుకు తమ్ముళ్ల పన్నాగం
- బార్ లైసెన్సు ఫీజు చెల్లించకుండా మీనమేషాలు
- లైసెన్సులు క్యాన్సిల్ చేసి కొత్తగా రూ.40 లక్షలకే దక్కించుకోవాలనే ఎత్తుగడ
- 20లోపు చెల్లించాలని నిబంధనలున్నా చోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ
- గడువు ముగిసినా విక్రయాలకు అనుమతిస్తూ మద్యం స్టాకు అప్పగింత



సాక్షి ప్రతినిధి, కడప : ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎత్తుగడను తెలుగుతమ్ముళ్లు అమల్లోకి తెచ్చారు. బార్ లైసెన్సు రెన్యువల్ చేయించుకోకుండా క్యాన్సిల్ చేయించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆపై తక్కువ ధరకే తిరిగి లైసెన్సు దక్కించుకునేలా పావులు కదుపుతున్నారు. పక్కాగా ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించేందుకు సన్నద్ధమయ్యారు. రూ.18 కోట్ల ఆదాయానికి ఎగనామం పెట్టబోతున్నా జిల్లాలో ఎక్సైజ్‌శాఖ చోద్యం చూస్తోంది. లైసెన్సు రెన్యువల్ కాకపోయినా మద్యం విక్రయాలకు అనుమతిస్తూ యథేచ్ఛగా స్టాకు అప్పగిస్తున్నారు.

బార్ లైసెన్సు ఫీజులు ఈ నెల 20లోపు చెల్లించాల్సిందిగా ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఈనెల 7న నోట్ ఆర్డర్ జారీ చేశారు. సీఆర్ నంబర్ 2199/2022 సీపీఈ/ఈ3 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. బార్ యాజమానుల నుంచి నిర్ణీత లైసెన్సు ఫీజుకు 10 శాతం అదనంగా వసూలు చేయాల్సిందిగా ఉత్తర్వులలో స్పష్టం చేశారు. 20 తేదీలోపు చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ గ్రేస్ పీరియడ్ అంటూ తెలుగుతమ్ముళ్లు కొత్తగా ఓ పదాన్ని తెరపైకి తెచ్చారు. వాస్తవంగా లైసెన్సు ఫీజు రూ.40 లక్షలు మాత్రమే. పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రతి బార్ రూ.1.70 కోట్ల నుంచి రూ.1.89 కోట్ల వరకూ ధర పలికింది. ఈ పరిస్థితుల్లో అన్నీ బార్లు రద్దు చేసుకొని తిరిగి ఎవరి బార్ వారికే దక్కేలా ప్రణాళికలు రచించుకున్నారు. ఆ మేరకు ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఉన్న 12 బార్ల యజమానులు ప్రత్యేకంగా రెండు సార్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు ఎమ్మెల్యే మద్దతు కూడగట్టారు. తద్వారా సరాసరిన ఒక్కొక్క బార్ నుంచి రూ.1.5 కోట్ల తక్కువకు దక్కించుకునేలా, అంటే మొత్తం రూ.18 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎత్తుగడకు తెరలేపారు.

బలవంతంగా తీసుకున్న ఆ రెండు బార్ల వల్లే..

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప నగరం నడిబొడ్డులో రెండు బార్‌లను తెలుగుతమ్ముళ్లు స్వాధీనం చేసుకున్నారు. 30 ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ వ్యాపారి నుంచి బలవంతంగా రెండు బార్‌లు సొంతం చేసుకున్నారు. కాగా, సదరు బార్ల యాజమాని మీ పేరుపై ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని, లైసెన్సు ఫీజు కూడా మీరే చెల్లించుకోవాలని నిబంధనలు పెట్టి వారికి అప్పగించారు. ఆ మేరకు ఈ నెల 20న లైసెన్సు ఫీజు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. ఇప్పుడు రెండు బార్ల లైసెన్సు రెన్యువల్ చేయించుకోవాలంటే రూ.4 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం చెల్లించలేని స్థితిలో ఉన్న తెలుగు తమ్ముళ్ల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టాలనే ఎత్తుగడను అవలంబిస్తున్నారు. రూ.40 లక్షలు మాత్రమే బార్ లైసెన్సు ఫీజు ఉంటున్న నేపథ్యంలో రద్దు చేయించుకొని.. తిరిగి వాటి స్థానంలోనే కొత్తగా తక్కువ ధరకు దక్కించుకోవాలనే దిశగా పావులు కదుపుతున్నారు. ఆ మేరకే ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా బేఖాతర్ చేస్తున్నారు. మరోవైపు ఆ శాఖ ఉత్తర్వులను క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఉత్తర్వులలో ఎలాంటి నిబంధన లేకపోయినా గ్రేస్ పీరియడ్ 10 రోజులంటూ అండగా నిలుస్తోంది. మరోవైపు మద్యం స్టాకు విభాగం లైసెన్సు రెన్యువల్స్ కాకపోయినా విచ్చలవిడిగా అప్పగిస్తూ తెలుగుతమ్ముళ్ల అక్రమ ఆదాయానికి అండగా నిలుస్తుండటం గమనార్హం.

టీడీపీ నేత ఇంటి వద్ద రేషన్ బియ్యం స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధి 3వ వార్డులోని టీడీపీకి చెందిన ఓ నేత ఇంటి వద్ద 300 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని, వీటిని స్వాధీనం చేసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తులు కొంత మంది మండల, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులకు గూగుల్ మ్యాప్‌తో సహా శుక్రవారం మధ్యాహ్నం సమాచారం అందించారు. అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. సాయంత్రానికి జిల్లా అధికారుల నుంచి ఫోన్లు రావడంతో ఎంఎల్ ఆర్ఐ సాయిప్రసాద్, వీఆర్ఓ రవి, త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ యోగేంద్ర తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అధికార పార్టీ నాయకుడు బియ్యం నిల్వ ఉన్న ఇంటికి తాళం వేశారు. నియోజకవర్గ టీడీపీ యువనేత నుంచి ఫోన్ రావడంతో అక్కడి నుంచి వారు జారుకున్నారు. సమస్య జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో మళ్లీ సిబ్బందిని పంపించారు. తలుపులు తెరచి చూడగా 33 బస్తాలు కనిపించాయి. వీటిని స్వాధీనం చేసుకుని ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి కేసు నమోదు చేశారు.